# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 11 | సంపుటి : 3 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | శనివారం | 12-4 -2025 | వెల : .రూ. 5.00



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

–జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:– 9705770909 సంప్రదించండి.






## భారత్ అభివృద్ధి..వారసత్వం లక్ష్యంగా పయనం

- విపక్షాలది కుటుంబ రాజకీయం
- వారికి అభివృద్ధి కన్నా స్వప్రయోజనాలే ముఖ్యం
- వారణాసిలో పలు అభివృద్ధి పనులకు మోడీ శ్రీకారం
- ఇటీవల అత్యాచార ఘటన పై అధికారులతో ఆరా

**వారణాసి**
భారత్ అభివృద్ధి, వారసత్వం అనే రెండింటితో ముందుకువెళ్తోందని ప్రధాని మోడీ అన్నారు. 2036లో నిర్వహించనున్న ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వాలని అనుకుంటుందని.. అందుకు అనుమతి -మిగతా 2 లో




## టెట్ పరీక్షల షెడ్యూల్ విడుదల

**జూన్ 15 నుంచి 30 వరకు టెట్ పరీక్షలు**

**హైదరాబాద్** ఏప్రిల్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్
తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష షెడ్యూల్ విడుదలైంది. జూన్ 15 నుంచి 30 వరకు టెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి వివరాలు ఏప్రిల్ 15 నుంచి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపింది. -మిగతా 2 లో



### తెలంగాణ తెచ్చుకుందే
## ఉగ్యోగాల కోసం

- వరంగల్‌లో మెగా జాబ్ మేళా ప్రారంభించిన మంత్రులు
- త్వరలో అంగన్‌వాడీ ఉద్యోగాల నోటిఫికేషన్ వెల్లడించిన మంత్రి సీతక్క

**వరంగల్,ఏప్రిల్ 11 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్**
తెలంగాణ తెచ్చుకుంది ఉద్యోగాల కోసమేనని మంత్రి సీతక్క తెలిపారు. వరంగల్ ఎంకే నాయుడు కన్వెన్షన్‌లో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించగా, మంత్రులు సీతక్క, కొండా సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. మెగా జాబ్‌మేళాకు భారీ స్పందన వచ్చిందని అన్నారు. భారీ సంఖ్యలో నిరుద్యోగులు తరలివచ్చారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 60వేల -మిగతా 2 లో

### మూసీ రివర్ ఫ్రంట్ పనుల్లో
# వేగం పెంచండి



**మూడు ఐలాండ్లను అత్యంత సుందరంగా అభివృద్ధి చేయాలి**


- బాపూఘాట్‌లో గాంధీ సరోవర్ నిర్మాణం
- మీర్ అలం ట్యాంక్‌పై బ్రిడ్జి నిర్మాణ పనులు
- అధికారులతో సమీక్షించిన సీఎం రేవంత్

**హైదరాబాద్, ఏప్రిల్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్**
మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. బాపూఘాట్లో నిర్మించ తలపెట్టిన గాంధీ సరోవర్‌తో పాటు మీర్ అలం ట్యాంక్ పై నిర్మించనున్న బ్రిడ్జి నమూనాలను సీఎం పరిశీలించారు. మీర్ అలం ట్యాంక్‌పై బ్రిడ్జి నిర్మాణ పనులకు జూన్‌లో టెండర్లు పిలవాలని ముఖ్యమంత్రి అన్నారు. ఈలోగా -మిగతా 2 లో



## బీఆర్ఎస్ సభకు అనుమతిపై 17లో గా తేల్చండి

**ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు**




**హైదరాబాద్,**
హనుమకొండలో బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సభకు అనుమతులపై విచారణను తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది. హనుమకొండలో సభకు పోలీసులు అనుమతి ఇవ్వడం లేదంటూ -మిగతా 2 లో



### పదేళ్లలో తెలంగాణను లూటీ చేసిన
## కేసీఆర్ కుటుంబం

- ఫార్ములా రేస్ కేసులో కేటీఆర్ అరెస్ట్ కాక తప్పదు
- కేసీఆర్ కుటుంబ దోపిడీపై సీబీఐ విచారణ జరపాలి
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డీమాండ్

**హైదరాబాద్, ఏప్రిల్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్**
ఫార్ములా ఈ రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏదో ఒక రోజు అరెస్ట్ కాక తప్పదని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ దోపిడీని భరించ లేకనే కాంగ్రెస్ పార్టీని -మిగతా 2 లో




## నేడు నగరంలో హనుమాన్ జయంతి శోభాయాత్ర

- గౌలిగూడ నుంచి తాడ్‌బన్ ఆంజనేయ మందిర్ వరకు ర్యాలీ
- భారీగా పోలీస్ బందోబస్తు..ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్, ఏప్రిల్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్**
హనుమాన్ జయంతి సందర్భంగా హైదరాబాద్ నగరంలో శనివారం ఘనంగా హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నారు. హనుమత్ జయంతి శనివారం రావడంతో మరితం కోలాహలం నెలకొననుంది. ఈ శోభాయాత్ర గౌలిగూడలోని శ్రీ రామమందిరం వద్ద ఉదయం 11 గంటలకు ప్రారంభమై, నగరంలోని -మిగతా 2 లో

### నేడు ఏపీ ఇంటర్
## ఫలితాల ప్రకటన

- అధికారిక వెబ్‌సైట్..వాట్సాప్‌లో వెల్లడి
- ఫలితాలపై సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన లోకేశ్




**అమరావతి,**
ఏపీలో శనివారం ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియా -మిగతా 2 లో

### కాంగ్రెస్ ప్రభుత్వంలో
# భారీ కుంభకోణాలు

- ఆర్థిక నేరానికి తెరలేపిన రేవంత్ ప్రభుత్వం
- 400 ఎకరాలు పక్కాగా అటవీ భూములే
- దానిపై రుణాలు ఎలా తెచ్చారో చెప్పాలి
- దీనిపై సీబీఐ విచారణ జరగాల్సిందే
- బీఆర్ఎస్ వర్కిర్ ప్రెసిడెంట్ కేటీఆర్ డీమాండ్



**హైదరాబాద్ ఏప్రిల్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం, విధ్వంసం, దృష్టి మళ్లించడం అనే 3డీ మంత్రంతో పాలన చేస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రేవంత్ ప్రభుత్వం ఆర్థిక నేరానికి తెరలేపిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో భారీ కుంభకోణాలు జరుగుతున్నాయని చెప్పారు. కంచ గచ్చిబౌలిలో జరిగిన పర్యావరణ విధ్వంసాన్ని చూసి దేశం మొత్తం విస్తుపోయిందన్నారు. -మిగతా 2 లో

## భారత్,చైనా సుంకాల గొడవ



**భారత్ అప్రమత్తంగానే ఉందన్న జైశంకర్**

**న్యూఢిల్లీ ఏప్రిల్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్**
అగ్రరాజ్యం అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతుంది. దీంతో ప్రపంచం తీవ్ర గందరగోళానికి గురైతుంది. ఇక, ఈ వివాదంపై న్యూఢిల్లీలో జరిగిన కార్నెగీ ఇండియా గ్లోబల్ టెక్నాలజీ సమ్మిట్‌లో భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ మాట్లాడుతూ.. భారతదేశం -మిగతా 2 లో

# భారత్ అభివృద్ధి..వారసత్వం లక్ష్యంగా పయనం

(మొదటి తరువాయి)

తీసుకోవడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. తన సొంత నియోజకవర్గమైన కాశీ ఎప్పటికీ తనదేనని.. తాను కాశీకి చెందినవాడినని మోదీ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తన సొంత నియోజకవర్గం వారణాసిలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ మరోమారు ప్రతిపక్షాలపై విరుచుకు పడ్డారు. ప్రతిపక్ష పార్టీలు అధికార కాంక్షతో కుటుంబ ప్రయోజనాలపై మాత్రమే దృష్టి సారిస్తున్నాయని విమర్శించారు. కానీ తమ పార్టీ ఎటువంటి పదవీ కాంక్ష లేకుండా సమ్మిళిత అభివృద్ధి ఇతివృత్తంగా ముందుకుసాగుతోందని అన్నారు. ఎన్డీఏ కూటమి నేతలంతా ప్రతి ఒక్క పౌరుడి అభివృద్దే ధ్యేయంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఫులే దంపతులను ఆదర్శంగా తీసుకొని తాము మహిళల విద్య, అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. వారణాసిలో రూ.3,880 కోట్ల విలువైన 44 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన ప్రధాని అక్కడి వారినుద్దేశించి ప్రసంగించారు. ప్రతిపక్షాలు 'పరివార్ కా సాథ్ పరివార్ కా వికాస్' అనే విధానాన్ని అనుసరిస్తాయని ప్రధాని పేర్కొన్నారు. కానీ దానికి విరుద్ధంగా తామెప్పుడూ 'సబ్‌కా సాథ్..సబ్‌కా వికాస్' నినాదంతో ముందుకువెళ్తామన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన ప్రాజెక్టుల్లో కూడా గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేశామని అన్నారు. వాటిలో 130 తాగునీటి ప్రాజెక్టులు, నాలుగు గ్రామీణ రోడ్లు, 100 కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు, 356 గ్రంథాలయాలు, పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉన్నాయని ప్రధాని తెలిపారు. గతంలో పూర్వాంచల్‌లో ఆరోగ్య సౌకర్యాలు తక్కువగా ఉండేవని, కానీ నేడు కాశీ పూర్వాంచల్‌కు ఆరోగ్య రాజధానిగా మారుతోందని ప్రధాని అన్నారు. 70 ఏళ్లు దాటిన ముగ్గురు లబ్ధిదారులకు ఆయుష్మాన్ కార్డులను అందజేశారు. ఇదిలావుంటే వారణాసిలో చోటుచేసుకున్న దారుణ సామూహిక అత్యాచార ఘటన దిగ్భ్రాంతికి గురిచేసింది. 6 రోజుల్లో 23 మంది వ్యక్తులు.. 19 ఏళ్ల యువతిపై అత్యాచారానికి పాల్పడిన అమానవీయ ఘటన ఇటీవల వెలుగుచూసిన సంగతి తెలిసిందే. ఇది ప్రధాని మోదీ దృష్టికి చేరడంతో ఆయన ఆరా తీశారు. శుక్రవారం వారణాసి కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మోదీ వారణాసిలో పర్యటించిన సందర్భంగా ఇటీవల జరిగిన అత్యాచార ఘటన గురించి జిల్లా మేజిస్ట్రేట్, పోలీస్ కమిషనర్, డివిజినల్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. మార్చి 29వ తేదీన బాధిత యువతి కొంతమంది స్నేహితులతో కలిసి బయటకు వెళ్లింది. ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో సామూహిక అత్యాచారం గురించి వెలుగులోకి వచ్చింది. పోలీసులకు ఆ యువతి వెల్లడించిన వివరాల ప్రకారం.. కొందరు యువకులు తనను పలు హోటళ్లకు, హుక్కా బార్లకు తిప్పుతూ అత్యాచారానికి పాల్పడ్డారని చెప్పింది.

# మూసీ రివర్ ఫ్రంట్ పనుల్లో వేగం పెంచండి

(మొదటి తరువాయి)

అందుకు అవసరమైన సర్వేలు, నివేదికలు, ప్రతిపాదనలు, డిజైన్లతో డీపీఆర్ను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మూసీ పునరుజ్జీవనంపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాసరాజు, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్తో పాటు– మూసీ రివర్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మీర్ అలం ట్యాంక్ పై నిర్మించే బ్రిడ్జికి సంబంధించి కన్సెల్టెన్సీలు తయారు చేసిన నమూనా డిజైన్లను అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రదర్శించారు. రెండున్నర కిలోమీటర్ల పొడవైన ఈ బ్రిడ్జిని అద్భుతంగా నిర్మించాలని, అదే సమయంలో సందర్శకులు, ప్రయాణికుల రక్షణకు అత్యంత ప్రాధాన్యముండే డిజైన్లను ఎంచుకోవాలని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. ఈ బ్రిడ్జితో పాటు మీర్ ఆలం ట్యాంక్‌లో వివిధ చోట్ల ఐలాండ్లా ఉన్న మూడు ప్రాంతాలను పర్యాటకులను ఆకట్టుకునేలా అందంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. సింగపూర్ లోని గార్డెన్స్ బై ది బే ను తలపించేలా బర్డ్స్ పారడైజ్, వాటర్ ఫాల్స్ లాంటివి ఉండేలా ఈ మూడు ఐలాండ్లను అత్యంత సుందరంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. వెడ్డింగ్ డెస్టినేషన్ కు వీలుగా ఉండే కన్వెన్షన్ సెంటర్లతో పాటు– అడ్వంచర్ పార్క్, థీమ్ పార్క్, అంఫీ థియేటర్ను ఏర్పాటు– చేసేందుకు వీలుగా డిజైన్లు ఉండాలన్నారు. బోటింగ్ తో పాటు– పర్యాటకులు విడిది చేసేలా రిసార్ట్స్, హోటల్స్ అందుబాటు–లో ఉండాలని సూచించారు. ట్యాంక్ లో నీటిని శుద్ధి చేయటంతో పాటు– ఐలాండ్ ను అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని ప్రతిపాదనలతో డీపీఆర్ సిద్ధం చేయాలని చెప్పారు. పీపీపీ మోడల్లో ఈ ఐలాండ్ జోన్ను అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. మీర్ అలం ట్యాంక్లో నీటి లభ్యతను, వరద వచ్చినప్పుడు ఉండే నీటి ప్రవాహ తీవ్రతను ముందుగానే అంచనా వేసుకొని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందు చూపుతో డిజైన్లు చేసుకోవాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన హైడ్రాలజీ తో పాటు– పర్యావరణానికి సంబంధించి నిపుణులు, లేదా ఆ రంగంలో పేరొందిన సంస్థలతో సర్వే చేయించాలని, ఆ నివేదికల ఆధారంగా అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. మీర్ అలం బ్రిడ్జితో పాటు– ఈ ఐలాండ్ జోన్ను పక్కనే ఉన్న జూ పార్కుకు అనుసంధానం చేయాలని సూచించారు. ఇక్కడి డెవెలప్మెంట్ ఎ÷–లాన్ను దృష్టిలో పెట్టు–కొని జూ పార్కును అప్ గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జూ అధికారులతో సంప్రదింపులు జరిపి, నిబంధనల ప్రకారం అప్ గ్రేడ్ చేసేందుకు ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

# పదేళ్లలో తెలంగాణను లూటీ చేసిన కేసీఆర్ కుటుంబం

(మొదటి తరువాయి)

తెలంగాణ ప్రజలు గెలిపించారన్నారు. గత పదేండ్లలో జరిగిన భూ దోపిడీపై విచారణ జరపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తానని ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబంపై సీబీఐతో విచారణ జరపాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ అంశానికి కేటీఆర్ అరెస్టుకు లింక్ పెట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కేటీఆర్ మాట్లాడే మాటలకు చిన్న పిల్లలు సైతం నవ్వుకుంటున్నారన్నారు. పదేండ్లలో భూ దోపిడి చర్చకు సిద్ధమా?.. దమ్ము ధైర్యముంటే చర్చకు రండంటూ కేటీఆర్‌కు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా సవాల్ విసిరారు. కరప్షన్‌కి కేరాఫ్ అడ్రస్ కేసీఆర్ కుటుంబమని ఆయన అభివర్ణించారు. లిక్కర్ స్కాం చేసింది కూడా కేసీఆర్ కుటుంబమేనని ఆయన గుర్తు చేశారు. అడ్డమైన వాళ్లు వచ్చి మాట్లాడుతున్నారని.. ఈ మాటలను నమ్మకండంటూ తెలంగాణ ప్రజలకు పీసీసీ చీఫ్ సూచించారు. కేటీఆర్ ఇంతగా దిగజారుతాడా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. చాలా తక్కువ సమయంలో అత్యంత ఎక్కువ ధనం దోపిడి చేసింది కేసీఆర్ కుటుంబమేనని ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ గుర్తు చేశారు. బిల్లీ రావుతో కేటీఆర్ ఒప్పందం చేసుకున్నాడని పేర్కొన్నారు. కేటీఆర్ గుంటూరులో ఏం చదువు నేర్చుకున్నాడో అర్థం కావడం లేదన్నారు. సగం సగం తెలుసుకొని రాజకీయ లబ్ది కోసం కేటీఆర్ మాట్లాడుతారంటూ ఎద్దేవా చేశారు. బీసీ కుల గణన వల్ల బీఆర్ఎస్ పార్టీలో వణుకు పుట్టిందన్నారు. బీఆర్ఎస్ పదేండ్లలో ఎన్నివేల ఎకరాలను కొల్లగొట్టారో తెలియదా? అంటూ ఆ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు.రైతులు బాగు పడుతుంటే కేటీఆర్‌కి కడుపు నొప్పి వస్తోందని ఎద్దేవా చేశారు. ఏఐ టెక్నాలజీతో వీడియోలు చేయించి తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి పంపారంటూ బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. తెలంగాణకి ఉద్యోగాలు రాకూడదా? అంటూ బీఆర్ఎస్ నేతలు సూటిగా ప్రశ్నించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో భారీ కుంభకోణాలు

(మొదటి తరువాయి)

ఆ 400 ఎకరాలు అటవీ భూమేనని, సుప్రీంకోర్టు తీర్పుల ఆధారంగా ఆ విషయాన్ని చెబుతున్నానని స్పష్టం చేశారు. హెచ్‌సీయూ భూముల వెనుక 10 వేల కోట్ల ఆర్థిక కుంభకోణం ఉందన్నారు. కుంభకోణానికి కర్త, కర్మ, క్రియ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటూ ఆరోపించారు. మహాత్మా జ్యోతిబా ఫూలే జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డికి అన్నీ తెలిసే భారీ ఆర్థిక నేరానికి పాల్పడ్డారని మండిపడ్డారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంతో దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందన్నారు. ఒక బీజేపీ ఎంపీ సహకారంతో ఈ స్కామ్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో ట్రస్ట్ ఎడ్వైజర్స్ ఇన్వెస్ట్మెంట్ అనే కంపెనీ రేవంత్ రెడ్డికి బ్రోకరిజం చేసిందన్నారు. అందుకు గాను .. సదరు కంపెనీకి రూ.170 కోట్లు లంచం ఇచ్చారన్నారు. సుప్రీంకోర్టు తీర్పులు, ఆర్బీఐ గైడ్‌లైన్సులను తుంగలో తొక్కారని చెప్పారు. అటవీ భూమిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం తాకట్టు పెట్టిందన్నారు. అటవీ భూమిని తాకట్టు పెట్టడం, అమ్మే అధికారం ప్రభుత్వానికి కూడా లేదన్నారు. వాల్టా, ఫారెస్టు చట్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఉల్లంఘించింది. బీజేపీ ఎంపీ సారధ్యంలోనే బ్రోకరేట్ కంపెనీ తీసుకొచ్చారు. ఆ ఎంపీకి రేవంత్ అనుచితి లబ్ధి చేకూరుస్తున్నారు. త్వరలోనే ఆ బీజేపీ ఎంపీ ఎవరో చెబుతానన్నారు. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థలకు లేఖ రాస్తున్నట్లు వెల్లడించారు. కేంద్రం, ఆర్బీఐ, సీబీఐ, సెబీ, ఎస్‌ఎఫ్ఐవో దర్యాప్తు చేయాలని కోరుతున్నాం. 400 ఎకరాలకు టీ–జీఐఐసీకి యజమాని కాదు. తమది కాని భూమిని టీ–జీఐఐసీ తాకట్టు– పెట్టింది. మోసపూరిత భూమిని తాకట్టు పెట్టుకుని బ్యాంకు రుణం ఇచ్చింది. 400 ఎకరాల భూమి విలువ రూ.5,239 కోట్లు– అని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ చెబుతున్నది. అదే భూమి విలువ రూ.30 వేల కోట్లు– అని రెవెన్యూ శాఖ చెప్పింది. లేని భూమి ఉన్నట్లు చూపి లోన్ తీసుకోవాలని చూశారు. భయంకరమైన ఆర్థిక దోపిడీకి రేవంత్ రెడ్డి పాల్పడుతున్నారు. తమది కాని భూమిని టీ–జీఐఐసీ ఎలా తాకట్టు పెడ్తుందని కెటిఆర్ ప్రశ్నించారు.

# నేడు ఏపీ ఇంటర్ ఫలితాల ప్రకటన

(మొదటి తరువాయి)

వేదికగా పేర్కొన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల పరీక్షల ఫలితాలు విడుదల చేస్తామన్నారు. విద్యార్థుల తమ ఫలితాలను ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చునని తెలిపారు. మన మిత్ర వాట్స్ యాప్ నంబర్‌కు 9552300009లో కూడా ఫలితాలు తెలుసుకోవచ్చునని చెప్పారు. అందరికి మంచి ఫలితాలు రావాలని కోరుకుంటూ మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు చెప్పారు. కాగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి1న ప్రారంభం అయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు.మార్చి 20వ తేదీ వరకు పరీక్షలు జరిగాయి. ఇప్పటికే ఇంటర్ పరీక్షల మూల్యాంకనం వేగంగా కొనసాంది. ఏప్రిల్ 6 నాటికి మూల్యాంకనం పూర్తి చేశారు. ఆ తర్వాత ఫలితాలను కంప్యూటరీకరణ చేసేందుకు 5-6 రోజుల సమయం పట్టింది. తొలిరోజు మొదటి సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ భాషపై పరీక్ష నిర్వహించారు. ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల విద్యార్థులకు రోజు మార్చి రోజు పరీక్షలు జరిగాయి. ఈ క్రమంలో అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 1,535 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 10.58 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు– చేసి ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారుల కార్యాలయాలకు అనుసంధానం చేశారు.

# టెట్ పరీక్షల షెడ్యూల్ విడుదల

(మొదటి తరువాయి)

తెలంగాణలో ఏడాదిలో రెండుసార్లు టెట్ పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని గతేడాది జులైలో ప్రకటించింది. ఇందులో భాగంగా గతేడాది డిసెంబర్‌లో టెట్ నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం.. ఈ ఏడాది జనవరిలో పరీక్షలు నిర్వహించింది. జనవరిలో జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 2.75లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. దాదాపు 2లక్షల మందికి పైగా హాజరయ్యారు.

# బీఆర్ఎస్ సభకు అనుమతిపై 17లో గా తేల్చండి

(మొదటి తరువాయి)

బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించగా.. శుక్రవారం విచారణ జరిగింది. ఆ సభకు అనుమతిపై పరిశీలిస్తున్నామని కోర్టుకు జీపీ తెలిపారు. వారం రోజుల్లో వరంగల్ సభ అనుమతిపై నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. సభ కోసం బీఆర్ఎస్ పెట్టుకున్న పర్మిషన్‌ను అనుమతించకపోవడం, దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం వల్లే హైకోర్టులో పిటిషన్ వేసినట్లు బీఆర్ఎస్ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. అయితే 17 లోపు సభ అనుమతిపై నిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను హైకోర్టు ఈనెల 21 కి వాయిదా వేసింది. అలాగే వరంగల్ పోలీసులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కాగా.. ఈనెల 27న హనుమకొండలోని ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి పది వరకు సభ నిర్వహిస్తామని గులాబీ పార్టీ పేర్కొంది. అయితే అందుకు పోలీసుల అనుమతి నిరాకరించడంతో బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై ఈరోజు విచారణ జరుగగా.. 17లోపు సభ అనుమతిపై నిర్ణయం తీసుకోవాలంటూ విచారణను వాయిదా వేసింది.

# తెలంగాణ తెచ్చుకుందే ఉగ్యోగాల కోసం

(మొదటి తరువాయి)

ఉద్యోగాలు ఇచ్చిందని గుర్తుచేశారు. త్వరలో అంగన్‌వాడీ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. ఇలాంటి జాబ్‌మేళాను నిరుద్యోగులు ఉపయోగించుకోవాలని సూచించారు. అవకాశాలు వస్తే వాటిని వదులుకోవద్దని అన్నారు. తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని చెప్పారు. సొంత ఊరు దాటితేనే.. భవిష్యత్తు బంగారం అవుతుందని మంత్రి సీతక్క తెలిపారు. 60 కంపెనీల ద్వారా 11వేల ఉద్యోగాలు కల్పిస్తున్నామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల ముందు తాము చెప్పామని.. అందులో భాగంగానే ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్‌పై ప్రత్యేక దృష్టి సాధించారని చెప్పారు. గత కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలపై పదేళ్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 60వేల ఉద్యోగాలు కల్పించామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం రావాలంటే కష్టం.. అందుకే ఇలాంటి జాబ్‌మేళాను నిర్వహించామని తెలిపారు. ప్రతిభ ఆధారంగానే ఉద్యోగం దక్కుతుందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

## నేడు నగరంలో హనుమాన్ జయంతి శోభాయాత్ర

(మొదటి తరువాయి)

పలు కీలక ప్రాంతాల గుండా తాడ్‌బండ్‌లోని శ్రీ హనుమాన్ మందిరం వద్ద ముగుస్తుంది. శోభాయాత్ర మార్గం పుత్లిబౌలి క్రాస్ రోడ్స్, ఆంధ్రా బ్యాంక్ క్రాస్ రోడ్స్, కోఠి, సుల్తాన్ బజార్ క్రాస్ రోడ్స్, రామ్‌కోఠి క్రాస్ రోడ్స్, కాచిగూడ క్రాస్ రోడ్స్, నారాయణగూడ వైఎంసీఏ, చిక్కడపల్లి క్రాస్ రోడ్స్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, అశోక్ నగర్, గాంధీ నగర్ బ్యాక్ సైడ్ వైశ్రాయ్ హోటల్, ప్రాగా టూల్స్, కవాడిగూడ, సీజీవో టవర్స్, బన్సీలాల్‌పేట రోడ్, బైబిల్ హౌస్, సిటీ లైట్ హోటల్, బాటా షోరూమ్, ఉజ్జయిని మహంకాళి టెంపుల్, ఓల్డ్ రామ్‌గోపాల్‌పేట రోడ్, పారడైజ్ క్రాస్ రోడ్స్, సీటీవో జంక్షన్, లీ రాయల్ ప్యాలెస్, బ్రూక్ బాండ్, ఇంపీరియల్ గార్డెన్, మస్తాన్ కేఫ్ మీదుగా సాగుతూ తాడ్‌బండ్‌లోని హనుమాన్ టెంపుల్‌కు చేరుకుంటుంది. ఈ శోభాయాత్ర సజావుగా సాగేందుకు పోలీసు శాఖ శనివారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించింది. ఈ రహదారులపై ప్రయాణించే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా లక్డీకాపూల్ నుంచి సికింద్రాబాద్ స్టేషన్, ఉప్పల్ వైపు వెళ్లే వాహనదారులు వీవీ స్టాచ్యూ, సోమాజిగూడ, గ్రీన్ ల్యాండ్స్, బేగంపేట్ లఫై ఓవర్, ప్రకాశ్ నగర్ లఫై ఓవర్, పారడైజ్‌లఫై ఓవర్ మీదుగా సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకోవాలని సలహా ఇచ్చారు. ఈ శోభాయాత్రలో భక్తుల భద్రత , ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసు శాఖ విస్తృత ఏర్పాట్లు– చేసింది, కాబట్టి నగరవాసులు ఈ ఆంక్షలకు సహకరించి, హనుమాన్ జయంతి వేడుకలు సాంతం సజావుగా జరిగేలా తోడ్పడాలని అధికారులు కోరుతున్నారు.

## భారత్,చైనా సుంకాల గొడవ

(మొదటి తరువాయి)

తన ప్రయోజనాలను కాపాడుకోవడానికి సిద్ధంగా ఉందని అన్నారు. రెండు అతి పెద్ద ప్రపంచ ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య పరంగా నువ్వానేనా అన్నట్లుగా సుంకాల యుద్ధం సాగుతోందన్నారు. జనవరి 20వ తేదీన డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగాఅధికారం చేపట్టిన వెంటనే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం వాషింగ్టన్‌తో చర్చలను వేగవంతం చేశామని కేంద్రమంత్రి జైశంకర్ అన్నారు. కానీ, ట్రంప్ తన మొదటి పదవీకాలం సమయంలో వాణిజ్య ఒప్పందం కార్యరూపం దాల్చక పోవడంతో ఇండో– అమెరికా వాణిజ్య విధానంపై తీవ్రమవుతున్న అనిశ్చితి నెలకొందన్నారు. కాగా, ఇప్పుడు మాత్రం ఆ ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ప్రయత్నిస్తోందని తేల్చి చెప్పారు. అయితే, ప్రస్తుతం అమెరికాలో ఆందోళనకర వాతావరణం నెలకొనడంతో.. చర్చల్లో వేగం తగ్గిపోయిందన్నారు. అయితే, యుఎస్–చైనా మధ్య సంబంధాలు చాలా భిన్నంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఇక, 1947లో భారత్ కి స్వాతంత్ర వచ్చిన తర్వాత అమెరికా– చైనా మధ్య తీవ్రమైన పోటీ– ఉండేది.. ఆ పోటీ–లో మేము చిక్కుకు పోయామన్నారు.. కాగా, ఇరు దేశాల మధ్య కొనసాగుతున్నది వాణిజ్యం, రాజకీయం, రక్షణ సమస్య కాదు.. ఇది చాలా సున్నితమైన అంశమని భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ వెల్లడించారు.

## తెలుగు పంచాంగం 12/4/2025,శనివారం



సూర్యోదయం & సూర్యాస్తమయం
సూర్యోదయం: ఉదయం 6:06 AM
సూర్యాస్తమయం: సాయంత్రం 6:27 PM
తిథి
పౌర్ణమి: ఏప్రిల్ 12, 3:21 AM నుండి ఏప్రిల్ 13, 5:52 AM వరకు
నక్షత్రం
హస్త: ఏప్రిల్ 11, 3:10 PM నుండి ఏప్రిల్ 12, 6:07 PM వరకు
చిత్తా: ఏప్రిల్ 12, 6:07 PM నుండి ఏప్రిల్ 13, 9:10 PM వరకు
అశుభ సమయాలు (దోషకాలాలు)
రాహుకాలం: ఉదయం 9:11 AM నుండి 10:44 AM వరకు
యమగండం: మధ్యాహ్నం 1:49 PM నుండి 3:22 PM వరకు
గుళిక కాలం: ఉదయం 6:06 AM నుండి 7:38 AM వరకు
దుర్ముహూర్తం: ఉదయం 7:44 AM నుండి 8:34 AM వరకు
వర్జ్యం: రాత్రి 3:09 AM నుండి 4:57 AM వరకు
శుభ సమయాలు (శుభ ముహూర్తాలు)
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:52 AM నుండి 12:41 PM వరకు
అమృతకాలం: ఉదయం 11:23 AM నుండి 1:11 PM వరకు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:27 AM నుండి 5:15 AM వరకు

# జ్యోతిరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త : క్యామ మల్లేష్



**ఇబ్రహీంపట్నం,ఏప్రిల్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** : ఇబ్రహీంపట్నంతి 199వ జయంతి సందర్భంగా భువనగిరి పార్లమెంట్ బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్ మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సంధ్భంగా మాట్లాడుతూ... సామాన్యుడిగా మొదలై.. సామాజిక ఉద్యమ కెరటంగా ఎదిగిన పూలే జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. సామాజిక కార్యకర్తగా, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్కర్త పూలే భావి తరాలకు సైతం మార్గదర్శకుడని అన్నారు . సమాజంలో వివక్షకు తావు లేదని, సమానత్వం ఉండాలని జీవితాంతం పోరాడిన మహనీయుడు పులే అని అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బండారి రాజయ్య, లక్ష్మమ్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో అంబలి కేంద్రం ప్రారంభోత్సవం

-బండారి రమేష్ సామాజిక సేవ కార్యక్రమం
-హాజరైన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి




**షాద్ నగర్, ఏప్రిల్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)** షాద్ నగర్ పట్టణంలోని శ్రీ బండారి రాజయ్య, లక్ష్మమ్మ సేవా సంస్థ ద్వారా బండారి రమేష్ నూతనంగా అంబలి కేంద్రం, చలివేంద్రం నూతనంగా నిర్వహించడం జరిగింది. ఈయొక్క కార్యక్రమమానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి హాజరుకావడం జరిగింది. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ వేసవి ఎండలు ఎక్కువగా ఉన్న నేపత్యంలో వివిధ ప్రాంతాలనుండి షాద్ నగర్ పట్టణానికి పని నిమిత్తం వచ్చే ప్రజలు అంబలి కేంద్రాన్ని సద్వినియోగ పర్చుకోవాలని అన్నారు. విష్ణువర్ధన్ రెడ్డి గారు రమేష్ జి గారినీ ఆత్మీయ అలింగనం చేసుకొని అభినందనలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, మోహన్ సింగ్, చేగు సుధాకర్ అప్ప తదితరులు ఉన్నారు..

# నేడు హెచ్‌సీయూ విద్యార్థులు విడుదల!



**హైదరాబాద్**
సంగారెడ్డి జిల్లా కంది జైలులో ఉన్న హెచ్‌సీయూ విద్యార్థులు నేడు విడుదల కానున్నారు. శుక్రవారం విడుదల కావాల్సి ఉండగా ఫార్మాలిటీస్ పూర్తి కావడంలో ఆలస్యమవడంతో వాయిదా పడింది. హెచ్‌సీయూ పరిధిలోని 400 ఎకరాల్లో చెట్లను నరికేయడాన్ని నిరసిస్తూ ఆందోళనలో పాల్గొన్న ఎర్రం నవీన్, రోహిత్‌ను పోలీసులు అరెస్ట్ చేసి కంది జైలుకు తరలించారు .బెయిల్ మంజూరైనప్పటికీ కూకట్‌పల్లి మెజిస్ట్రేట్ సెలవులో ఉండటంతో ఎల్బీనగర్‌కు బదిలీ చేసినట్టు విద్యార్థులు వెల్లడించారు. అక్కడి నుంచి బెయిల్ పేపర్లు తిరిగి కంది జైలు కు వెళ్లేసరికి సమయం అయిపోవడంతో విడుదల నేటికి వాయిదా వేశారని చెప్తున్నారు.

# బెల్ట్ జోరు.. మత్తులో జోగుతున్న పల్లెలు..





- జిల్లాలో బెల్ట్ షాపుల దందా 'మూడు బాటిళ్లు.. ఆరు కాసులు'గా తయారైంది.
- అబ్కారిశాఖ అధికారు ల అండదండలతో రెచ్చిపోతున్న మద్యం మాఫియా గల్లిగల్లికో బెల్ట్ షాపు ఏర్పాటు చేస్తోంది
- ఛిద్రమవుతున్న సామాన్య కుటుంబాలు



**యాదాద్రి భువనగిరి,ఏప్రిల్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్** జిల్లాలో బెల్ట్ షాపుల దందా 'మూడు బాటిళ్లు.. ఆరు కాసులు'గా తయారైంది. అబ్కారిశాఖ అధికారుల అండదండలతో రెచ్చిపోతున్న మద్యం మాఫియా గల్లిగల్లికో బెల్ట్ షాపు ఏర్పాటు చేస్తోంది. మంచినీళ్లు దొరకని షాపులు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు గానీ, మద్యం దొరకని చోటంటూ లేకపోవడం గమనార్హం. నివాస గృహాలు, చిన్న చిన్న కిరాణా షాపుల్లోనూ కావలసినంత మద్యం దొరుకుతోంది. వైన్, బార్ షాపుల్లో సమయసారిణి ప్రకారం మద్యం లభ్యమవుతుండగా బెల్టు షాపుల్లో మాత్రం 24 గంటలు అందుబాటులో ఉంటోంది. సామాన్యులు పొద్దంతా పని చేసి సంపాదించిన సొమ్మును మద్యానికి వెచ్చిస్తూ కుటుంబాలను వీధిన పడేస్తున్నారు. యాదాద్రి జిల్లాలో బెల్టు షాపుల ఆగడాలు ఎక్కువయ్యాయి. అనధికారిక టెండర్ ప్రక్రియలో భాగంగా గ్రామాల్లో బహిరంగంగా మద్యం అమ్మకాలకు స్థానికంగా హక్కుల దక్కించుకుంటున్నాయి. ప్రత్యేకంగా మలిగెలు అద్దెకు తీసుకుని దర్జాగా మద్యం అమ్మకాలు బహిరంగంగా సాగిస్తున్నాయి. బెల్టు షాపులను ఎవరైనా ప్రశ్నిస్తే మీకేం భయం లేదు.. మేమున్నాం.. మేం చూసుకుంటామనే భరోసా బెల్టు వ్యాపారులకు ఇస్తున్నాయి. బెల్టు షాపులపై అధికారులకు ఫిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకోవడం మాట అటుంచితే, ఫిర్యాదు చేసిన వారి పేరు వివరాలు, ఫోన్ నెంబర్ తో సహా బెల్టు షాపుల యజమానులకు అధికారులే చేరవేస్తున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లా ఎక్సైజ్ పరిధిలోని ఓ మండల కేంద్రంలో కొనసాగుతున్న ఓ బెల్టు షాపులో అక్రమ మద్యం అమ్మకాలపై ఓ మీడియా జర్నలిస్టు వార్త రాస్తే బెల్టు వ్యాపారి తన అనుచరులతో జర్నలిస్టు ఇంటి మీదికి వచ్చి దాడికి దిగిన సంఘటనలు ఉన్నాయి. అధికారుల అండతో పాటు బెల్టు షాపుల నిర్వాహకులకు గ్రామ కమిటీలు




కూడా కొండంత అండగా నిలబడుతుండటంతో బెల్టు బాబులు అడ్డగోలుగా హవా చెలాయిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

**- లైసెన్సుడ్ వైన్ షాపులు 82.. బెల్టు షాపులు దాదాపు 400 ..**

యాదాద్రి భువనగిరి జిల్లాలో పిడికెడు లైసెన్సుడ్ వైన్ షాపులుంటే గంపెడు బెల్టు షాపులన్న చందంగా బెల్టు షాపులున్నాయి. లైసెన్సుడ్ వైన్ షాపులు 82, ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న బెల్టు షాపులు లైసెన్సుడ్ వైన్ షాపుల సంఖ్యకు మూడింతలకు పైగా దాదాపు 400 వరకుంటే అనధికారిక బార్లు పర్మిట్ రూంల మాదిరిగా విచ్చల విడిగా కొనసాగుతున్నట్లు అనధికారిక గణాంకాలను బట్టి తెలుస్తోంది. జాతీయ రహదారుల వెంట దాబాల్లోనే కాకుండా, గ్రామాల్లో, పట్టణాల్లోని పలు హెూటల్స్ లో కూడా అనఫిషియల్ పర్మిట్ రూంలు కొనసాగుతున్నా ఇటు పోలీసులు కానీ, అటు ఎక్సైజ్అధికారులు కానీ పట్టించుకుని చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

**- బెల్టు షాపుల బినామీలు లైసెన్సుడ్ వ్యాపారులే..**

లైసెన్సుడ్ షాపులు పొందిన వారిలోనే ఎక్కువగా బెల్టు షాపుల బినామీలుగా వ్యాపారం నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. మరి కొందరైతే లైసెన్సు ఒక గ్రామంలో దుకాణానికి లైసెన్సు వస్తే అక్కడ వ్యాపారం సరిగా జరగడంలేదనో, మరింకేం కారణంతోనో తమకు అనుకూలమైన మండల కేంద్రాల్లో అక్కడి లైసెన్సు పేరుతో నిబంధనలకు విరుద్ధంగా దర్జాగా నడిపిస్తున్నారు. ఇదే కాకుండా ఒక్కో లైసెన్సుడ్ షాప్ పరిధిలో కనీసం మూడు, నాలుగు బెల్టు షాపులను అనధికారికంగా నడిపిస్తున్నట్లు తెలుస్తోంది.

**- అసలు మాటున నకిలీ మద్యం అమ్మకాలు..**

లైసెన్సుడ్ వ్యాపారులు బినామీలుగా నిర్వహిస్తున్న బెల్టు షాపుల దందాలో నకిలీ మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నట్లు సమాచారం. లైసెన్సుడ్ షాపుల్లో నకిలీ మద్యం అమ్మకాలు జరిపితే లైసెన్స్ క్యాన్సిల్ అయ్యే ప్రమాదంతో పాటు కేసులు కూడా అయ్యే అవకాశాలుండటంతో ఆ రిస్క్ లైసెన్సుడ షాపుల్లో కాకుండా బెల్టు షాపుల్లో తీసుకుని యధేచ్ఛగా నకిలీ మద్యం అమ్మకాలు, చీప్ లిక్కర్లు అమ్ముతున్నట్లు ఆరోపణలున్నాయి. లైసెన్సుడ్ వైన్ షాపుల మాటుల బినామీలుగా బెల్టు షాపులు నడుపుతున్న వ్యాపారుల వ్యవహారం పూర్తిగా తెలిసినా ఎక్సైజ్ అధికారులకు అంతా తెలిసినా ఏం తెలియనట్లు వ్యవహరిస్తున్నారు.

# హనుమాన్ యజంతి సందర్భంగా శోభాయాత్ర

- చింతల రవికుమార్ గుప్త



**ఎల్బీనగర్,ఏప్రిల్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్ )** హనుమాన్ జయంతి పురస్కరించుకొని శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు వనస్థలి పురం డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్త శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో వనస్థలిపురంలో హనుమాన్ శోభాయాత్ర శనవారం సాయంత్రం 05.00 గంటలకు ఏం.ఈ.రెడ్డి గార్డెన్స్ నుంచి ప్రారంభం ప్రారంభమవుతుందన్నారు.ఈ శోభాయాత్ర కు వనస్థలిపురం డివిజన్ పరిధిలోని BRS సీనియర్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, భక్తులు , BRS పలు విభాగాల కమిటీ అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు, మహిళలు, యువత ఈ కార్యక్రమంలో భక్తులంతా పాల్గొని విజయవంతం చేయాలని వనస్థలిపురం డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్త ఒక ప్రకటన లో కోరారు.

# నారాయణపూర్ తండాలో పోషణ పక్వాడ సంబరాలు



**వెల్దండ, ఏప్రిల్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)** నాగర్ కర్నూల్ జిల్లా డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు నారాయణపూర్ తండా అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీల సంరక్షణ, ఆరోగ్యంపై అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశ్యంగా పెట్టుకున్నారు. డాక్టర్ సాయి పవన్ నాయక్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు పోషకాలను బాగా తీసుకోవడం వల్ల శిశు ఎదుగుదలకు మరియు ఆరోగ్యానికి ఎంత ముఖ్యమో వివరించారు. చిరుధాన్యాలు, పోషక పదార్థాలతో కూడిన ఆహారం శిశువు ఆరోగ్యవృద్ధికి దోహదపడుతుందన్నారు. గర్భిణీలు మంచి ఆహారం తీసుకోవడం పుట్టబోయే బిడ్డ ఆరోగ్యానికి మేలని, ఆరోగ్యమే మహాభాగ్యం అని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ఉద్యోగులు, ఆశా వర్కర్ రోజా, అంగన్వాడీ వర్కర్ చిన్న సరిత, విజయ్ కుమారి, టీచర్ వాణి మరియు ఇతరులు పాల్గొని మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా, ఆరోగ్య అంశాలలో ప్రజలు అశ్రద్ధ వహించకూడదని, జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు.

## పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.

మమ్మల్ని సంప్రదించడానికి:

ఇమెయిల్: neelagiriexpress@gmail.com

సంప్రదింపు నెంబర్: 9705770909

మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.

**మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!**

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**- ఎస్సై నాగుల ఉపేందర్ యాదవ్**



**మోటకొండూరు,ఏప్రిల్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :**
యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ నాగుల ఉపేందర్ యాదవ్ అన్నారు. మోటకొండూరులో క్రికెట్ ప్రీమియర్ లీగ్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది సామ రాజేందర్ రెడ్డి, చామల సురేష్ రెడ్డి, గంధమల్ల శ్రీకాంత్, గోగికార్ సంపత్, కర్రె ప్రవీణ్, బచ్చపు రవి పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**అమనగల్లు, ఏప్రిల్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అమనగల్లు పట్టణం కేంద్రంలోని జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఎన్ఎస్యూఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫరీద్ మాట్లాడుతూ.. బడుగు మైనార్టీ ఎస్సీ ఎస్టీ కులాలకు చెందిన ప్రజల జీవితాల్లో వెలుగు నింపిన మహనీయుడు పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, సలీం, అతిఫ్ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

# రాష్ట్రానికి మేలు చేయకున్నా పర్వాలేదు, విధ్వంసం చేయకుండా ఉంటే చాలు

**–సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**



**వనపర్తి,ఏప్రిల్ 11( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణకి,తెలంగాణ ప్రజలకి మేలు చేయకుంన్నా పర్వాలేదు కానీ మేము చేసిన అభివృద్ధిని విధ్వంసం చేయకుండా ఉంటే చాలు అని శుక్రవారం తన ఆవాసంలో నిర్వహించిన పత్రిక సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన కృష్ణా నది జిల్లాలు ఆంధ్ర తెలంగాణ వాటా గురించి మాట్లాడుతూ శ్రీశైలం కుడి మెయిన్ కెనాల్ లైనింగ్ పనుల వల్ల, కృష్ణా నదిపై ఏపీ చేపట్టిన ప్రాజెక్టుల మూలంగా తెలంగాణకు సంభవించే నష్టాలు ఒకటిగా వివరిస్తూ సుదీర్ఘంగా మాట్లాడారు. శ్రీశైలం కుడి మెయిన్ కెనాల్ లైనింగ్ పనులు ఏపీ ప్రభుత్వం చేపట్టడం వల్ల కెనాల్ సామర్థ్యం గణనీయంగా 44,000 క్యూసెక్కుల నుండి 89,762 క్యూసెక్కులకు పెరుగుతుందని కనాల్ సామర్థ్యం పెరగడం వల్ల ఏపీ ప్రభుత్వం శ్రీశైలం జలాశయం నుండి ఎక్కువ నీటిని రాయలసీమ ఎత్తిపోతల పథకం ఇతర ప్రాజెక్టులకు తరలించే అవకాశం ఉందని ఇది కృష్ణా బేసిన్‌లోని తెలంగాణ ప్రాజెక్టులకు నాగార్జునసాగర్, కల్వకుర్తి ఎత్తిపోతల, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు నీటి లభ్యతను తగ్గిస్తుంది. ముఖ్యంగా వర్షాభావ సమయాల్లో . తెలంగాణలోని రైతులు సాగునీటి కొరతను ఎదుర్కొంటారు. ఇది వ్యవసాయ ఉత్పాదకతను దెబ్బతీస్తుంది. శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వ తగ్గడం వల్ల తెలంగాణలోని విద్యుత్ ఉత్పాదన మరియు ఇతర నీటి ఆధారిత కార్యకలాపాలు పూర్తిగా దెబ్బతినవచ్చు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ (కే డబ్ల్యూ డీటీ – II ) తీర్పు కృష్ణా నది జలాల పంపిణీపై కీలకమైనది. ఏపీ ప్రభుత్వం ఈ తీర్పు తెలంగాణకు అనుకూలంగా వస్తుందని భావిస్తూ, కెనాల్ లైనింగ్ పనులను నిబంధనలకు విరుద్ధంగా చేపడుతుంది. కే డబ్ల్యూ డి టి– II తీర్పు ఏపీ మరియు తెలంగాణ మధ్య నీటి కేటాయింపును సమీక్షిస్తుంది. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు తెలంగాణకు ఎక్కువ నీటిని కేటాయిస్తే, రాయలసీమ మరియు ఇతర ప్రాంతాలకు నీటి లభ్యత తగ్గుతుందని. అందుకే, తీర్పు అమలు కాకముందే ఎస్సార్ ఎం సి సామర్థ్యాన్ని పెంచడం ద్వారా ఎక్కువ నీటిని స్వాధీనం చేసుకోవాలని ఏపీ భావిస్తున్నది ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ రీఆర్గనైజేషన్ యాక్ట్, 2014 ప్రకారం, కృష్ణా బేసిన్‌లో కొత్త ప్రాజెక్టులు లేదా సామర్థ్య విస్తరణలు KRMB మరియు అపెక్స్ కౌన్సిల్ అనుమతి లేకుండా చేపట్టకూడదు. అయినప్పటికీ, ఏపీ ఎస్ఎంఎస్సి లైనింగ్ పనులను గుట్టుగా చేపట్టడం ఈ నిబంధనలను ఉల్లంఘించడమే అని,ఏపీలోని టీడీపీ ప్రభుత్వం రాయలసీమ ప్రాంతంలో రాజకీయంగా బలపడడం కోసం, నీటి లభ్యతను పెంచే ప్రాజెక్టులను వేగవంతం చేయాలని భావిస్తున్నది ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ మనుగడ ఏపీలోని టీడీపీ మద్దతు మీద ఆధారపడిన నేపథ్యంలో దానిని అవకాశంగా తీసుకుని ఏపీలోని చంద్రబాబు ప్రభుత్వం జలదోపిడీకి పాల్పడుతున్నది. కేంద్రం చేతిలో కీలుబొమ్మగా ఉన్న కేఆర్ఎంబీ ఏపీ ప్రయత్నాలను నిలువరించడం లేదుమరోవైపు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈవిషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. ఇప్పటికే నాగార్జున సాగర్ కేంద్ర బలగాల ఆధీనంలోకి వెళ్లినా, శ్రీశైలం నుండి, నాగార్జున సాగర్ నుండి కేటాయింపులకు అదనంగా నీటిని కొల్లగొడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వంలో చలనం లేదు. కృష్ణా నదిపై ఆంధ్రప్రదేశ్ (ఏపీ) ప్రభుత్వం 2014 తర్వాత చేపట్టిన ప్రాజెక్టులు మరియు ఎత్తిపోతల పథకాలతో పాలమూరు జిల్లాకు కలిగే నష్టాలుఏపీ చేపట్టిన ఎత్తిపోతల పథకాలతో ముఖ్యంగా రాయలసీమ ఎత్తిపోతల పథకం, శ్రీశైలం జలాశయం నుండి గణనీయమైన నీటిని తరలిస్తాయి. దీంతో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వంటి తెలంగాణ ప్రాజెక్టులకు నీటి నీటికొరత ఏర్పడుతుంది. 2014 తర్వాత ఏపీ ప్రభుత్వం కృష్ణా నదిపై చేపట్టిన పథకాలు రాయలసీమ ఎత్తిపోతల పథకం (రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం):శ్రీశైలం జలాశయం నుండి కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాలకు నీటిని ఎత్తిపోసే పథకం. ఈ పథకం కింద శ్రీశైలం కుడి మెయిన్ కెనాల్ సామర్థ్యాన్ని 44,000 క్యూసెక్కుల నుండి 89,762 క్యూసెక్కులకు పెంచే లైనింగ్ పనులు చేపట్టారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణ:శ్రీశైలం జలాశయం నుండి బనకచెర్ల రెగ్యులేటర్ ద్వారా రాయలసీమకు నీటిని సరఫరా చేసే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44,000 క్యూసెక్కుల నుండి 80,000 క్యూసెక్కులకు పెంచే పనులు చేపట్టారు. వెలిగొండ ప్రాజెక్టు కృష్ణా నదిపై శ్రీశైలం జలాశయం నుండి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు నీటిని సరఫరా చేసే బహుళార్థసాధక ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు కింద 43.5 టీఎంసీ నీటిని ఎత్తిపోస్తారు. చింతలపూడి ఎత్తిపోతల పథకంకృష్ణా నది నుండి పశ్చిమ గోదావరి మరియు కృష్ణా జిల్లాలకు నీటిని ఎత్తిపోసే పథకం. ఈ పథకం కొత్త ఆయకట్టును సృష్టించడంతో పాటు ఇప్పటికే ఉన్న ఆయకట్టును స్థిరీకరిస్తుంది.

**శ్రీశైలం కుడి మెయిన్ కెనాల్ లైనింగ్ పనులు:**
శ్రీ శైలం కుడి మెయిన్ కెనాల్ సామర్థ్యాన్ని రెట్టింపు చేసేందుకు లైనింగ్ పనులు చేపట్టారు, దీని ద్వారా రాయలసీమకు ఎక్కువ నీటిని తరలించవచ్చు అని వారి ఆలోచనలు ఉన్నాయని వీటన్నిటినీ కాంగ్రెస్ ప్రభుత్వము చూస్తూ కూర్చుందని ఆయన అన్నారు.

## భువనగిరిలో ఘనంగా మహాత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలు

**- విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త, మానవతవాది, మహాత్మ జ్యోతిబాపూలే**

**- తెలంగాణ జర్నలిస్టు యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా**



**యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
: సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త, మానవతవాది మహాత్మ జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా జనతా టీవీ రిపోర్టర్ తెలంగాణ జర్నలిస్టు యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా వారి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు వారితో పాటు జర్నలిస్టు కిషన్ పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగిద్దాం

**- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**షాద్ నగర్, ఏప్రిల్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతిని పురస్కరించుకుని షాద్ నగర్ ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ . ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ... మహిళలు మరియు పేదలలో విద్యా వ్యవస్థ కోసం నిరంతరం పాటుపడిన మహాత్మ జ్యోతిరావు పూలే ఆశలను మనందరం కొనసాగిద్దామని అన్నారు . ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గౌతమ్ నగర్ చౌరస్తాలో పూలేకు ఘన నివాళి...



**ఫిలింనగర్, ఏప్రిల్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ గౌతమ్ నగర్ చౌరస్తా లో సామాజిక ఉద్యమాలకు మార్గదర్శి, బహుజన చైతన్య దీప్తి, వివక్షలపై పోరాడి, మహిళా విద్యకు విశేష కృషి చేసిన సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆ మహనీయుడు చిత్రపటానికి జూబ్లీహిల్స్ డివిజన్ నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కాటూరి రమేష్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా కల్వకుర్తిలో ఘనంగా వేడుకలు




**కల్వకుర్తి, ఏప్రిల్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కల్వకుర్తి పట్టణంలో బీసీ సబ్ ప్లాన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పక్షాల నాయకులు మరియు స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బహుజన సమాజ్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి ఎట్టి ఆంజనేయులు, కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు కాయితి విజయ్ కుమార్ రెడ్డి, బీసీ సబ్ ప్లాన్ అధ్యక్షుడు రాజేందర్, జేఏసీ చైర్మన్ సదానంద గౌడ్ మరియు గోపాల్, ఎండి రేష్మ, శ్రీనివాస్ యాదవ్, కానుగుల జంగయ్య, రామరాజు తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిరావు పూలే సేవలను స్మరించుకుంటూ వారికి గౌరవ సూచకంగా పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ప్రసంగించిన నాయకులు, మహాత్మా పూలే సమాజంలో సమానత్వం మరియు విద్యా హక్కుల కోసం చేసిన పోరాటాలను వృత్తి నైపుణ్యంతో వివరించి, ఆయన ఆశయాలను ప్రజలకు చేరువ చేసేందుకు అందరూ కలసి కృషి చేయాలని కోరారు.

# చెట్టు = అమ్మ, చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**

-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.

-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.

-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**

-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.

-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.

చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"

మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# శ్రీరిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమం

**దేవరకొండ, ఏప్రిల్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

దేవరకొండ మండలంలోని శ్రీరిపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని పెద్దతండ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం – పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని అంగన్‌వాడీ టీచర్లు పి. సంతాబాయి, పి. పద్మ, ఇ. సునిత, అలాగే ఏఎన్ఎమ్ ఐ. డోజ్ తదితరులు పాల్గొన్నారు. గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు, గ్రామ పెద్దలు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్నవారికి పోషకాహారం యొక్క ప్రాముఖ్యతను తెలియజేసే ప్రయత్నం జరిగింది. ముఖ్యంగా శరీరంలో పోషక లోపాలు రాకుండా ఉండేందుకు ఆకుకూరలు, పాలు, పండ్లు, పప్పులు, గుడ్లు వంటి ఆహారాన్ని నిత్యం తీసుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. అలాగే రాగులు, సజ్జలు, మొలకలు, శనగలు, ఉలవలు, మిరపగుళ్లు వంటి ప్రాదేశిక ఆహార పదార్థాల ప్రాముఖ్యతను వివరించి, వాటిని ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏటా ఏప్రిల్ 8 నుండి 22 వరకు గ్రామ స్థాయిలో నిర్వహిస్తూ ప్రజలకు పోషకాహారం మీద అవగాహన కల్పించడానికి ప్రణాళిక రూపొందించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్తుల ఆరోగ్యం మెరుగుపడే దిశగా మరింత శ్రద్ధ పెట్టాలని పలువురు నాయకులు సూచించారు.

# భాజపా బాగ్ అంబర్పేట్ డివిజన్ క్రియాశీల కార్యకర్తల సమావేశం ...





**అంబర్పేట్, ఏప్రిల్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

భారతీయ జనతా పార్టీ బాగ్ అంబర్పేట్ డివిజన్ క్రియాశీల కార్యకర్తల సమావేశం డివిజన్ అధ్యక్షుడు చుక్క జగన్ అధ్యక్షతన డి.డి కాలనీ లోని ఓ. శ్రీనివాస్ రెడ్డి నివాసంలో జరిగినది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిజెపి రాష్ట్ర సహా కోశాధికారి ఓ. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఏప్రిల్ 6వ తేదీ నుండి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14వ తేదీ వరకు శుభ్రత పరిశుభ్రత సేవా కార్యక్రమాలు, దేవాలయాల సందర్శన, బిజెపి బస్తి బాట కార్యక్రమం ఇంకా అనేక కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ పిలుపునివ్వడం జరిగిందని అన్నింటినీ విజయవంతం చేయాలని అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్క కార్యకర్త వారి ఇంటిపై బిజెపి జెండాను ఎగురవేయాలని, ఆనాటి నుండి ఈనాటి వరకు పార్టీ పరంపరను వివరించారు.

# కబ్జాకు గురైన దళితుల పట్టా భూములకు రక్షణ కల్పించండి

## మాదిగ కుల పట్టాదారు రైతులు



**వనపర్తి,ఏప్రిల్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):**

కబ్జాకు గురైన మాదిగ రైతుల పట్టా భూములకు రక్షణ కల్పించాలని మాదిగ పట్టాదారు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మారెమ్మ కుంటలో మాదిగ కుల రైతులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాదిగ కుల రైతులు మాట్లాడుతూ...... పట్టణంలోని మారెమ్మ కుంట లో సర్వేనెంబర్ 1041,1042,1054,1055,1060,1061,1062 గల భూమిలో మాదిగలకు చెందిన 11 ఎకరాల పట్టా భూమి ఉందన్నారు. గతంలో ఇట్టి భూమిలో నుంచి నాలుగు ఎకరాల 15 గుంటల భూమిని ప్యాట గొల్ల తిరుపతయ్య అనే రియల్ ఎస్టేట్ వ్యాపారికి కొనుగోలు చేశామని తెలిపారు. కానీ సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారి ప్యాట తిరుపతయ్య దళితులమైన తమను మభ్యపెట్టి సర్వే నెంబర్ల పైన బై నెంబరు వేసుకొని ఏకంగా 11 ఎకరాల మొత్తం భూమిని కబ్జా చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇట్టి విషయాన్ని గతంలో ప్రజావాణి ద్వారా కలెక్టరేట్లో ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయిందని, అంతేకాకుండా తనకు ఉన్న డబ్బు బలం, రాజకీయ పలుకుబడితో వ్యవస్థను మేనేజ్ చేస్తున్నాడని వాపోయారు. తమ భూమి పైకి వెళ్లి భూమిని చదును చేస్తుండగా పోలీసుల సహకారంతో రైతులమైన తమపైనే దౌర్జన్యం చేస్తున్నాడని, సమాజంలో ఉన్న కొందరు రాజకీయ బ్రోకర్ల ద్వారా అమాయక రైతులమైన తమ భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నాడని ఆవేదన వెల్లబుచ్చారు. అంతేకాకుండా ఇట్టి భూమిలో కేవలం రెండే ఎకరాలకు మాత్రమే నాలా అనుమతి పొంది ఏకంగా 11 ఎకరాలు మొత్తం రియల్ ఎస్టేట్ వెంచర్ వేసి ప్రభుత్వాన్ని కూడా మోసం చేసి, ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నాడని తెలిపారు. కావున ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే మెగా రెడ్డి ,జిల్లా కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులు తమకు న్యాయం జరిగే విధంగా స్పందించి, కబ్జాదారుడైన ప్యాట తిరుపతయ్య పై చట్టపరమైన చర్యలు తీసుకొని, తమ భూమిని తమకు ఇప్పించాలని వేడుకున్నారు. ఈ సమావేశంలో మాదిగ కుల పట్టాదారు రైతులు.... బంకలి కంట్రోల్ రాములు, మాజీ కౌన్సిలర్ గంధం కొండయ్య, డి రాజు, గంధం సత్యం, బంకలి సుబ్రహ్మణ్యం, డి దేవదాస్, బంకలి సవరయ్య, గొర్ల కృష్ణయ్య, గొర్ల మహేష్, కాకులవరం భరత్ భూషణ్, తలారి లచ్చమ్మ, బంకలి బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతిరావు పూలే

-చదువే అంటరానితనాన్ని దూరం చేస్తుందన్న మహనీయుడు

-బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు

-పిప్పళ్ళ వెంకటేష్

-డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా

-కద్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహారెడ్డి



**కద్తాల్,ఏప్రిల్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిభా పూలే జయంతి సందర్భంగా కద్తాల్ మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పిప్పళ్ళ వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించిన నాయకులు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి,గొప్ప సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిభా పూలేగారని అన్నారు.మహిళల అభ్యున్నతి కోసం కృషిచేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని,ముఖ్యంగా 1850వ సంవత్సరం కాలంలో మహిళలు విద్యకు నోచుకోకుండా సమాజానికి చాలా దూరంగా బ్రతికేవారని,వారి యొక్క అభ్యున్నతి కోసం తన భార్యామణి సావిత్రిబాయి పూలేతో కలిసి విద్యాసంస్థలు నెలకొల్పి మహిళలకు విద్య యొక్క ప్రాముఖ్యతను చాటిచెప్పి విద్యాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు.బహుజనుల,వెనుకబడిన వర్గాల కోసం మహాత్మా జ్యోతిబా పూలే చేసిన సేవల్ని గుర్తుంచుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.బీసీ ఐక్యత కోసం పూలే తన జీవితాన్ని ధారపోశారని అన్నారు.అధిపత్య కులాలపై ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ నాయకత్వ లక్షణాలతో పాటు నిబద్దత అలవరుచుకోవాలని కోరారు.బీసీలు సంఘటితమై అన్ని రంగాల్లో రిజర్వేషన్లు వచ్చేలా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలలో మరియు ఇతర రంగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఆమోదించిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కూడా పార్లమెంటులో బిల్లు పెట్టి ఆమోదింప చేయాలని బీజెపి నాయకులను మరియు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్,సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా,సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనరసింహారెడ్డి,సింగిల్ విండో డైరెక్టర్ చేగురి వెంకటేష్,బీసీ సంక్షేమ సంఘం మండల ప్రధాన కార్యదర్శి మూడ రవి,బీసీ సంక్షేమ సీనియర్ నాయకులు చందోజి,మాలె మల్లేష్,పూలే విగ్రహ దాత కంటేకార్ తిరుమలేష్,రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్,బీజెపి పార్టీ మండల అధ్యక్షుడు మహేష్,ఎమ్మార్పీఎస్ నాయకుడు సిద్ది గారి దాసు,నాయకులు రవీందర్ రెడ్డి,రామచంద్రయ్య, రాజేందర్ గౌడ్,గంజి చంద్రశేఖర్,ప్రవీణ్ గౌడ్, శ్రీకాంత్,రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ సర్వీసు లేదు.. ప్రైవేటు వాహనాలు రావు

- బీబీనగర్ మండలంలో గిరిజన గ్రామలలో ఆర్టీసీ, ప్రైవేటు వాహనాల జాడే లేదు.
- ఆర్టీసీ సర్వీసు లేక విద్యార్థుల,కూలీల తిప్పలు



ఇందిరమ్మ కాలనీలో నడుచుకుంటూ వెళ్తున్న ప్రయాణికులు


**బీబీనగర్,ఏప్రిల్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**

బీబీనగర్ మండలంలో పలు గ్రామల్లో సరియైన ఆర్టీసీ బస్సుల, ప్రైవేటు వాహనాల జాడే లేదు ఇందిరమ్మ కాలనీలో గిరిజనుల అవస్థలు ప్రయాణికుల సంఖ్య ఏటా పెరుగుతున్నా, బస్సులను మాత్రం అధికారులు నడపడం లేదు. బస్సు సౌకర్యం లేని గ్రామాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని జిల్లా లోని అనేక గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడపలేకపోతోంది. ఓవైపు ప్రయాణికుల సంఖ్య పెరుగుతుంటే, మరోవైపు ఆర్టీసీ బస్సుల సంఖ్య తగ్గుతూ వస్తోంది యాదాద్రి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గతం లో చాలా ఆర్టీసీ బస్సులు తిరిగేవి కానీ ఆర్టీసీ ఆదాయం కారణంగా పలు గ్రామల్లో ఉన్న బస్సులకే దిక్కు లేకుండా పోయింది కాలేజీలకు వెళ్ళే చదువుకునే విద్యార్థులు,కూలీలకు వెళ్ళే వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఇకనైనా చదువుకునే విద్యార్థులు ,ఉపాధి కోసం వెళ్ళే కూలీలను దృష్టిలో ఉంచుకొని తమ గ్రామాల పై యాదగిరిగుట్ట ఆర్టీసీ ఎండీ దయతలచి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.



మాకు పనికి వెళ్ళడానికి చాలా ఇబ్బంది గా ఉంది మాకు సొంత వాహనం లేక ఇబ్బందులకు గురవుతున్నం

– మోహన్ రావు బీబీనగర్



మా కలని నుండి సరైన ఆర్టీసీ బస్సుల సౌకర్యం లేకపోవడం తో నిత్యం పలు రకాల పనులకోసం వెళ్ళే వారు నడుచుకుంటూ వెళ్లవలసిన పరిస్థితి నెలకొంది యాదగిరిగుట్ట ఆర్టీసీ ఎండీ దయతలచి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నా.

– సీతారాం బీబీనగర్

# సమానత్వం కోసం పోరాడిన తత్వవేత్త జ్యోతిబాపూలే




**– సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ...**

**అంబర్పేట్, ఏప్రిల్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మనుషులంతా అన్ని రంగాల్లో సమానత్వంతో జీవించాలని, ఆధిపత్య విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ తన జీవితాన్ని ధారపోసిన భారతీయ సామాజిక తత్వవేత్త మహాత్మ జ్యోతిరావు పూలే అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. శుక్రవారం నగరంలో అంబర్పేట అలీ కేఫ్ చౌరస్తా వద్ద మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలను సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక దార్శనికుడిగా, సంఘ సంస్కర్తగా, వర్ణ వివక్ష వ్యతిరేక పోరాటానికి బాటలు వేసిన మహనీయుడు పూలే అన్నారు. వివక్ష లేని సమానత్వ సమాజం కోసం జీవితాంతం శ్రమించిన గొప్ప సామాజిక తత్వవేత్త జ్యోతిబా పూలే అని కొనియాడారు. పూలే ఆశయాలు, ఆశలకు అనుగుణంగా సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని మహాత్మ జ్యోతిరావు పూలే 19వ శతాబ్దంలో గొప్ప సంఘసంస్కర్తలో అగ్రా గాన్యుడన్నారు. బీసీ ఎస్సీ ఎస్టీల విద్యకు కృషి చేసిన గొప్పవ్యక్తిని కొనియాడారు. మూడు నమ్మకాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం చేసి, జనాభా ప్రతిపాదన ఉద్యోగాలు ఇవ్వాలని బ్రిటిష్ ప్రభుత్వానికి చూయించిన మహనీయుడు పూలేన్నారు. కానీ దేశంలో బిజెపి పార్టీ ఆర్ఎస్ఎస్ ఇప్పటికి కొన్ని కార్పొరేట్ శక్తులు మతతత్వ పార్టీలు సామాన్యులకు విద్య ఉపాధి దూరం చేస్తూ కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పాలని చూస్తున్నాయని ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ పబ్బం గాడుడుతున్నారని విమర్శించారు. మతాన్ని రెచ్చగొడుతూ పిల్లలకు విద్యను దూరం చేయాలనే కుట్రలు పండుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అబ్బాస్,డిజీ నరసింహారావు,రమణ,సెంట్రల్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు కులం లో ఇప్పుడు ఎక్కడికి పోయిన గర్జన చర్చే

**– మహేందర్ ...**



**హైదరాబాద్, ఏప్రిల్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

గత కొన్ని సంవత్సరాలనుండి మున్నూరు కాపు సంఘాలు తమ శక్తి వంచన లేకుండా పని చేస్తూ కులాన్ని ముందుకు తీసుకొని వెళ్తున్నారు. మనకు 2 వేల మంది కన్నా ఎక్కవ మంది తో సమావేశం పెట్టి మన బల నిరూపణ చూపించే అవసరం రాలేదు. 1931 కుల ఘనణ ప్రకారం మున్నూరు కాపులు దాదాపు 5 నుండి ఆరు లక్షల పై చిలుకు మున్నూరు కాపులను చూపించారు. అదే ప్రామాణికంగా సమాజంలో ఉన్నతంగా రాజకీయ లలో మన వాటా మనకు ఇప్పటి వరకు దక్కింది. 2014 టీ ఆర్ ఎస్ సమగ్ర సర్వే ప్రకారం దాదాపు 28 లక్షలు గా 13.5 శాతంగా చూపించారు. అప్పుడు మన నిరసనలు వ్యక్తం చేసాము. దాదాపు 10 లక్షలు తక్కువ చూపారు అని దాని ద్వారా 4 గురు మంత్రులుగా ఉండే మున్నూరు కాపులు రెండు క్యాబినెట్ లో ఒకరికే పరిమితం అయ్యాము. ప్రజా ప్రభుత్వం చేసిన కుల ఘన ణ లో 3.5 దాదాపు 13.5 లక్షలుగా చూపించే ప్రయత్నం చేసారు. దానితో కనీసం ఒక్క మంత్రి పదవి దక్కలేదు. మిగితా పదవుల్లో ప్రాథణ్యత తగ్గింది. దీని పై గౌరవ అపెక్స్ కమిటీ సభ్యులు ఒక మీటింగ్ ఏర్పాటు చేసి అపెక్స్ కమిటీ గౌరవ చైర్మన్ కేంద్ర మంత్రి బండి సంజయ్ మరియు మున్నూరు కాపు సంగం గౌరవ అధ్యక్షులు వద్ది రాజు రవిచంద్ర, ఎంపీ కే లక్ష్మణ్ మరియు వివిధ కుల సంఘాల ప్రతి నిధులు అన్ని పార్టీ రాజకీయ నాయకులతో చర్చించి భవిష్యత్తులో మున్నూరు కాపు గత వైభవం రావాలంటే ఒక గర్జన చేసుకొని మన బల నిరూపణ ద్వారా మన సంఖ్య బలం నిరూపించుకోవాలని తీర్మానం చేసారు. తర్వాత వి.హనుమంత రావు ఆధ్వర్యంలో కే కేశవ రావు విప్ అది శ్రీనివాస్ మరియు అన్ని పార్టీ ల వారితో గర్జన నిర్వహించడం ద్వారా మన బల నిరూపణ చేసుకొని మన కు రావలిసిన వి సాధించుకుందాం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుదాం అని తీర్మానం చేసారు.కానీ వారు ప్రభుత్వం లో ఉండడం వాళ్ళ ప్రత్యేక్షంగా ఉండడం వాళ్ళ ఇబ్బంది కలిగింది. తర్వాత పెద్దలు కలిసి మిగితా పార్టీ పెద్దలను సంప్రదించి ముందుకు వెళ్లడం జరుగుతుంది. తర్వాత కలిసి వచ్చే సంఘాలతో సమావేశం చేసి ఏప్రిల్ 13 జల విహార్ లో అన్ని పార్టీ ప్రజా ప్రతినిధులు మరియు కలిసి వచ్చే కుల సంఘాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి ముందుకు వెళ్తున్నారు.ఆ కార్యక్రమం తర్వాత కలిసి వచ్చే కుల సంఘాలతో గర్జన సభ పూర్తి కమిటీ వేసి గర్జన ఏర్పాట్లు చేస్తారు.

అప్పటి వరకు ఇదిగో పులి అదిగో పులి. అన్న చందంగా చేయకండి ఇప్పుడు గర్జన ఏ పార్టీ కి అనుకూలం కాదు. వ్యతిరేకం కాదు. ఇది కేవలం మన బల నిరూపణ కోసమే.. ఇప్పుడు ఎం మ్మెల్యే, ఎంమ్మెల్సీ ఎంపీ ఎలక్షన్ లేవు.. కార్పొరేషన్ పదవుల కోసం ఇంత పెద్ద మీటింగ్ అవసరం లేదు... ఇప్పటికి మన మీద మనం విమర్శలు చేసుకొని సమాజంలో మనకు గౌరవాన్ని తగ్గిచుకుంటున్నాము.

ఈ గర్జన జరిగితే అన్ని పార్టీ లో ఉన్న నాయకులకు గౌరవం పెరిగి అవకాశాలు వస్తాయి. ముఖ్యంగా ఇప్పుడు అధికారం లో ఉన్న కాంగ్రెస్ నాయకులకు ఎక్కువ లాభం జరిగుతుంది. అంతే కాకుండా సమాజంలో ఉన్న సామాన్య మున్నూరు కాపు ల కు ఒక ఆత్మ స్థైరం మరియు మనో ధైర్యం కలుగును.సమాజంలో మనం ఐక్యంగా ఉన్న మని మన జోలికి రావడానికి ఎవరు సాహసం చేయరు...

మన ఇగో లా వాళ్ళ వ్యక్తి గత స్వార్థం వాళ్ళ గర్జన పై విమర్శలు చేసి అపుకుంటే మున్నూరు కాపు కులం వంద సంవత్సరాలు వెనకకు వెళ్లే ప్రమాదం ఉంది అన్నారు.

# ట్రంప్ బెదిరింపులకు తలొగ్గని చైనా..

## అమెరికాపై 125 శాతం సుంకాలు ప్రకటించిన డ్రాగన్

**అమెరికా,ఏప్రిల్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

అగ్రరాజ్యం అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతోంది. రెండు దేశాలూ పోటాపోటీగా ఒకరిపై ఒకరు సుంకాలు విధించుకుంటున్నాయి. డ్రాగన్‌పై అమెరికా 145 శాతం ప్రతీకార సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఇక ట్రంప్ బెదిరింపులకు చైనా సైతం ఏమాత్రం వెనకడుగు వేయట్లేదు. అగ్రరాజ్యంపై ప్రతీకార సుంకాలతో దాడి చేస్తోంది. గతంలో అమెరికా దిగుమతులపై సుంకాలు 84 శాతానికి పెంచిన డ్రాగన్.. ఇప్పుడు మరింత పెంచింది. అమెరికాపై 125 శాతం సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించింది.

**చైనాపై బాదుడే బాదుడు..**

గత మార్చి వరకు చైనా వస్తువులపై అమెరికా 10 శాతం సుంకాన్ని విధించింది. ఇటీవల పెంచిన పన్నుతో ఇది 54 శాతానికి చేరుకున్నది. దీనిపై డ్రాగన్ దీటుగా స్పందించింది. ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 34 శాతం అదనపు సుంకం



విధించాలని నిర్ణయించింది . దీనిపై ఆగ్రహించిన ట్రంప్ టారిఫ్‌ల విషయంలో వెనక్కి తగ్గాలంటూ డ్రాగన్‌కు వార్నింగ్ ఇచ్చారు. మరో 50 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో టారిఫ్‌లు 104 శాతానికి చేరాయి. అయినా చైనా వెనక్కి తగ్గలేదు. అమెరికాపై 84 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించింది. ట్రంప్ హెచ్చరికలను చైనా పెడచెవిన పెట్టడంతో మళ్లీ అదనపు సుంకాల పోటు తప్పలేదు. చైనా నిర్ణయంతో ట్రంప్ బుధవారం మరో 21 శాతం బాదారు. దీంతో చైనాపై ప్రతీకార సుంకాలు 125 శాతానికి చేరింది. ఇక ఫెంటానిల్ అక్రమ రవాణాలో చైనా పాత్ర ఉందన్న ఆరోపణలకుగాను ప్రత్యేకంగా 20 శాతం సుంకాలు విధించడంతో మొత్తం టారిఫ్‌లు 145 శాతానికి చేరింది. మొత్తానికి ఈ పరస్పర సుంకాలతో ఇరు దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధం మరింత పెరిగినైట్టెంది.

**బెదిరింపులు, ఒత్తిళ్లు పనిచేయవ్**

మరోవైపు అమెరికా సుంకాల యుద్ధమే చేయాలనుకుంటే.. తుదివరకూ తాము పోరాడతామని చైనా స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అమెరికా చర్చలకు రావాలంటే తమ తలుపులు తెరిచే ఉంటాయని వెల్లడించింది. తాము ఘర్షణకు ప్రయత్నించబోమని, ఎలాంటి ఒత్తిడిని ఎదుర్కోవడానికైనా వెనుకాడబోమని స్పష్టం చేసింది. 'చైనా వైఖరి స్పష్టంగా, స్థిరంగా ఉంది. కవ్వింపు చర్యలకు భయపడం. అమెరికా మాట్లాడాలనుకుంటే.. మా తలుపులు తెరిచే ఉంటాయి. కానీ పరస్పర గౌరవం, సమానత్వం ఆధారంగా సంభాషణ జరగాలి. చైనాతో డీల్ చేయాలంటే.. ఒత్తిడి, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ వంటివి పనిచేయవు' అని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధి హి యోంగ్కియాన్ అన్నారు.

# హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక ఉత్సవాల్లో పాల్గొన్న ఉప్పల



**కల్వకుర్తి, ఏప్రిల్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్**

: కల్వకుర్తి పట్టణంలో హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన ఉత్సవాలు మరియు ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా జరుగాయి. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, డిసిసి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ మున్సిపల్ చైర్మన్ రాచోటి శ్రీశైలం, బీసీసీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, పిఎసిఎస్ చైర్మన్ తలసాని జనార్దన్ రెడ్డి, కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్య ప్రకాష్ రావు, ఆలయ చైర్మన్ చింతల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్




**అచ్చంపేట, ఏప్రిల్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

అచ్చంపేట పట్టణంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని ఎన్టీఆర్ స్టేడియంలో మాల వారియర్స్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ని ఘనంగా ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ మూడు రోజుల పాటు నిర్వహించబడుతుంది, ఆఖరి రోజు, ఏప్రిల్ 14న, బహుమతుల ప్రధాన ఉత్సవ కార్యక్రమం జరగనుంది. మాల ఉద్యోగుల సంఘం డివిజన్ నాయకులు కే. ఆంజనేయులు తెలియజేసిన వివరాల ప్రకారం, ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రత్యేకంగా పాల్గొన్నారు. టోర్నమెంట్ ప్రారంభానికి దళిత సంఘాల నేతలు కుంద మల్లికార్జున్, జనార్ధన్, సైదులు, అనిల్, రాంప్రసాద్ గౌడ్, శ్రీనివాసులు, విష్ణు, రవీందర్ తదితరులు హాజరయ్యారు.


# వెల్దండలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**వెల్దండ, ఏప్రిల్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

వెల్దండ మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వెల్దండ అంబేద్కర్ విగ్రహం వద్ద పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ముదిరాజ్ సంఘం నాయకులు మరియు వివిధ పార్టీల ప్రముఖులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మహాత్మ జ్యోతిరావు పూలే సేవలను కొనియాడారు. అంటరానితనాన్ని రూపుమాపడానికి, సమాజానికి సమానత్వం అందించడానికి ఆయన కృషి అమోఘమని పేర్కొన్నారు. అదనంగా, మహిళా విద్యాభివృద్ధి కోసం ఆయన చేసిన వినూత్న ప్రయోగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు నూకం వెంకటయ్య, కాషారపు వెంకటయ్య, కృష్ణ ముదిరాజ్, లింగం బాలరాజ్, భయ్యా మల్లయ్య, మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, జయప్రకాష్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. ఇంకా, వెల్దండ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోతిలాల్ నాయక్, కిసాన్ సెల్ తాలూకా అధ్యక్షులు పర్వత్ రెడ్డి, సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, మరికొందరు నాయకులు మరియు గ్రామ ప్రజలు ఈ వేడుకలో పాల్గొని పూలే ఆశయాలను కొనసాగిస్తామని ప్రకటించారు.

# 30 నుంచి చార్‌ధామ్ యాత్ర



**డెహ్రాడూన్ ఏప్రిల్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

ఉత్తరాఖండ్‌లో చార్‌ధామ్ యాత్ర ఈ నెల 30 నుంచి ప్రారంభమవుతుంది. భక్తులు యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లను సందర్శిస్తారు. గంగోత్రి, యమునోత్రి ఆలయాలను ఈ నెల 30 నుంచి, కేదార్‌నాథ్‌ను వచ్చే నెల 2 నుంచి, బద్రీనాథ్‌ను వచ్చే నెల 4 నుంచి భక్తుల కోసం తెరుస్తారు.భక్తులు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయించుకోవచ్చు. డెహ్రాడూన్, హరిద్వార్, గుప్త కాశి, సోన్‌ప్రయాగ్ తదితర నగరాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లలో కూడా భక్తులు నమోదు చేయించుకోవచ్చు.